"ఏంటి?"

"ఒక ఆడపిల్ల ఇష్టానికి విరుద్ధంగా గాని ఆమెను బెదిరించిగాని బలత్కారంగా...."

"రేప్"

"కరెక్టు."

"రాక్షసుడివి"

"అవును నేరస్థులంతా నన్నలాగే పిలుస్తుంటారు"

"అందుకని నన్ను రాక్షసంగా 'అదే....' అల్లరి పెడతానంటావు" ఆగింది క్షణం! "ఒకవేళ నేను ఇష్టపడ్డానే అనుకో!"

"అప్పుడు అది బలాత్కారం క్రిందరాదు"

"నీ ఐ.పి.సి. బుక్ మూలకి విసిరేసి నా దగ్గరకిరా"

"దేనికి?"

"నీ శక్తి సామర్థ్యాలు ప్రదర్శించడానికి."

"నిజం" ఉత్సుకతగా అడిగాడు.

"కాకపోతే దానికి ముందుగా నువ్వో పజిల్‌కి జవాబు చెప్పగలగాలి" ఆగిందో క్షణం "మరేంలేదు.... మీ డిపార్ట్‌మెంటంటే నాకు పాపం చిన్నచూపు. ఆందులో నువ్వు కాస్త అరుదైన కేరక్టరువి అన్న నమ్మకం ఉందనుకో.... అందుకే పన్నెండుగంటల టైమ్ యిస్తున్నాను.... అంటే సాయంకాలం ఏడు గంటలదాకా అన్నమాట.... కరెక్ట్‌గా జవాబు చెప్పావనుకో నీ ఇష్టం.... నీ సెక్షన్ 375 తో సంబంధం లేకుండా నువ్వన్న దానికి నేను సిద్ధపడతాను."

"ఓ.కే...."

రెండు క్షణాల తరవాత అంది హరిత "చాలా శతాబ్దాల క్రిందటి మాట....ఓ రాజ్యాన్ని నాలాంటి ఓ యువరాణీ పాలిస్తూందట.... అక్కడ నీలాంటి విప్లవకారుడు మహా అల్లరి పెట్టేస్తుండేవాడట. ఒకనాడు తన సేనలతో అతడ్ని బంధించి కస్టడీలోకి తీసుకుందట.... అర్థమైందా?"

"అయింది."

"అపుడా రాణి ఆ తెలివైన విప్లవకారుడికో చిన్న సమస్య ఇచ్చింది. నీ ప్రాణాలు తీయడం మాత్రం ఖాయం.... కాకపోతే పోయే ముందు నువ్వేదన్నా 'ఒక నిజం' చెబితే సింపుల్‌గా ఉరితీస్తాను లేదా ఆడపిల్లల్ని నీ మీదికి పంపి నిన్ను ఇష్టమొచ్చినట్టు సెడ్యూస్ చేయించి ప్రాణాలు తీస్తానందట.... బోధపడిందా?".

"పడింది పడింది."

"అప్పుడు ఆ యువకుడు ఓ నిజం చెప్పాడు. చెప్పి తన ప్రాణాలు కాపాడుకున్నాడు. అదేదో నువ్వు చెప్పగలగాలి.... చెబితే సాయంకాలం ఏడు గంటలకి మా డాడీ ఎలాగూ క్లబ్బుకి వెళతాడు కాబట్టి ఇక నీ ఇష్టమొచ్చినట్టు నన్నేమన్నా చేసుకోవచ్చు.... సరేనా!".

"అలాగే"

"నమ్మమంటావు."

"నీ శీలం మీదొట్టు."

"చూస్తాగా!" ఫోన్ క్రెడిల్ చేసింది.

హరిత చెప్పిందోమారు మననం చేసుకున్న యశస్వి పెదవులపైన సన్నగా చిరునవ్వు మెదిలింది అప్పుడే జవాబు స్ఫురించినట్టు.

టైమ్ చూసుకున్నాడు.

ఉదయం ఏడున్నర కావస్తూంది....

మరో అయిదు నిముషాలలో అతని బులెట్ తుంపాలవేపు దూసుకుపోయింది.

** ** ** **

నానీ చదివే స్కూల్లో క్లాస్‌టీచరుని కలుసుకున్న యశస్వి హెడ్ మిస్ట్రెస్ ముందే నానీకి సంబంధించిన అతిముఖ్యమైన వివరాలు కొన్ని సేకరించగలిగాడు.

"వయసుకు మించిన తెలివితేటలతోపాటు అమ్మన్నా, తాతయ్యనా చాల ఎక్కువగా ఇష్టపడే మనస్తత్వం నానీది. అదికాదు నానీలో మమ్మల్ని ఎక్కువ ఆకట్టుకున్న విషయం.... బహుశా తాతయ్య ప్రభావమో తల్లి పెంపకంలోని ప్రత్యేకతో అబద్ధమంటే గిట్టనివాడు నానీ.... అలాంటివాడు పాపం మానసికంగా చాలా దెబ్బతినేశాడు" అంతేకాదు మరెన్నో యశస్వి ఆశ్చర్యపోయే విషయాల్ని కథలు కథలుగా చెప్పింది.

అప్పుడు చూశాడు దూరంగా స్కూలువేపు నడుచుకొస్తున్న నానీని.

దిగమింగుకోలేని ఏబాధనో మోసుకొస్తున్నట్టు నడుస్తున్న నానీని చూస్తుంటే నిజంగా యశస్వికి మనసు తరుక్కుపోయిది.

"నానీ అంటే ప్రత్యేకించి నాకు ఓ ఇష్టంలాంటిది ఏర్పడి ఇలా వచ్చాను టీచర్........ నానీతో కొన్ని నిముషాలు మాట్లాడాలనుంది కాస్త ఒంటరిగా..... కెన్ యూ పర్మిట్ మి?"

ఒక పోలీసాఫీసరు అలాంటి ఉత్సుకతను ప్రదర్శించడం అసహజంగా కనిపించినా హెడ్‌మిస్ట్రెస్ ఆ విషయం గురించి లోతుగా ఆలోచించదలుచుకోలేదు.

అందుకే ఖాళీగా ఉన్న ఓ క్లాస్‌రూమ్‌లో కూర్చుని మాట్లాడుకునే అవకాశం కల్పించింది.

"నానీ!" యశస్విని చూడగానే గుర్తుపట్టేశాడు నానీ "నేను పోలీసంకుల్‌ని.... గుర్తుపట్టావా?"

తలూపాడు.

ఆప్యాయంగా దగ్గరకు తీసుకునేసరికి ఆమాత్రం ఆత్మీయతకు మొహం వాచిపోయినట్టు వెక్కి వెక్కి ఏడ్చేశాడు.

నిజమే....

నానీ ఇప్పుడు రాత్రుళ్ళు నిద్రపోవడంలేదు.

అమ్మలేని ఇంటిలో అమ్మలా లాలించగలిగే వ్య క్తి దొరక్క ఉన్న తాతయ్యా నోరు మెదపకుండా కళ్ళనీరు పెట్టుకుంటుంటే ఓదార్పు అందక రాత్రుళ్ళు కుమిలి పోతున్నాడు.

మంచంపై పడుకుంటే తను రోజూ కాలువేసే అమ్మ పొట్ట గుర్తుకొస్తుంది.

"పాలు తాగావా నానీ?" ఖాళీగా వున్న గదిలో నానీ కళ్ళు తుడుస్తూ అడిగాడు యశస్వి.

"నేం తాగనుగా" మరోమారు రెట్టించాడు.

"అవునుకదూ.... మీ అమ్మ చెప్పింది"

ఉలికిపాటుగా చూశాడు నానీ.

"అవును నానీ.... మీ అమ్మ నాకు అక్కలాంటిది కదా.... రాత్రి కలలోకొచ్చి చెప్పింది....అనవసరంగా అబద్ధం చెప్పానూ అంటూ తెగ బాధపడిపోయింది."

"కలలోకొచ్చా...." నానీ కళ్లలో అణువంత మెరుపు "మరి అబద్ధమెందుకు చెప్పింది?".

"పాపం అందుకే బోలెడంత బాధపడింది నిన్ను తలుచుకుంటూ ఎంత ఏడ్చిందో తెలుసా!".

నానీకూడా ఏడ్చేస్తున్నాడు.

"అమ్మంటే నీకు చాల ప్రేమట కదా"

తలూపాడు.

"అమ్మ ఏం చెబితే నువ్వది చేసేవాడివట కదా?"

"అవును."

"చెప్పింది.... ఆ రాత్రి...." నానీ కళ్ళలోకే చూస్తూ  అన్నాడు యశస్వి "ఆ.... మంటల్లో.... అసలు-నువ్వు.... పాలు... అడగలేదని- చెప్పింది"

"నేను అడగలేదంకుల్"

"అదే నేనూ అన్నాను - ఏడ్చేస్తూ ఏమందో తెలుసా.... అబద్ధమంటే మా నానీకి అసలు గిట్టదు. అందుకే వాడ్ని అడిగితే అంతా చెప్పేస్తాడు వెళ్ళు తమ్ముడూ అంటే ఇలా వచ్చాను."

యశస్వి అయిదునిమిషాలలో మొత్తం కథని తెలుసుకున్నాడు.

ఆ కథలో కామేశ్వరి మొదలుకుని సరళ, రాజారావుల గురించేకాక పావని కాలిపోతుంటే అంతా చూస్తూ ఎలా నిలబడింది, తను వెళ్లబోతుంటే తండ్రి ఎలా ఆపేసిందీ అన్నీ చెప్పేశాడు.

పూర్తిగా బోధపడిపోయిన యశస్వి పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

తన అంచనా తప్పుకాలేదు.          పావని మరణించింది ప్రమాదంలో కాదు.   ఒక పథకం ప్రకారం జరిగిన హత్యది!

"చూడు నానీ" యశస్వి ఫైవ్‌స్టార్ చాక్‌లెట్ అందించాడు "ఇది అంతా అంటే నేను నిన్ను కలిసింది మీ నాన్నగారికి చెప్పకూడదు"

“ఎందుకు?” అమాయకంగా అడిగాడు.

“ఎందుకంటే ఇవన్నీ మీ అమ్మనిన్ను కోర్టులోనే అంటే తప్పు చేసిన వాళ్ళని శిక్షించే జడ్జిగారుంటారే వాళ్ళముందు మాత్రమే చెప్పమంది. మీ నాన్నక్కాదు-సరేనా?”.

“ఓ” తలూపాడు “లేకపోతే అమ్మకి మళ్ళీ కోపమొస్తుందిగా!”

“గుడ్.... బహుశా మూడురోజుల్లో నువ్వు కోర్టులో ఇలాగే అన్నీ చెప్పాల్సి వుంటుంది. భయపడవుగా?”.

అడ్డంగా తలూపాడు భయపడనన్నట్టు!

యశస్వి నానీకి ముద్దుపెట్టి వెళ్ళిపోయాడు.

చాల సునాయాసంగా వివరాల్ని సేకరించగలిగిన యశస్వి సాయంకాలానికల్లా సరళ, కాంతమ్మ, చంద్రాల పేరున సమన్స్ పంపాడు సరిగ్గా మూడు రోజుల్లో కోర్టుకి హాజరుకమ్మని.

అప్పటికే ఒక పోలీస్ ఇన్‌స్పెక్టర్ స్కూలుకివచ్చి నానీని కలిసిన విషయాన్ని తెలుసుకున్న చంద్రం ఎంత కంగారుపడ్డాడూ అంటే విచక్షణ కోల్పోయిన అతడు మరో అఘాయిత్యానికయినా సిద్ధపడేట్టున్నాడు.

సరిగ్గా అప్పుడు గదిలోకి అడుగుపెట్టాడు నానీ.

తనవేపే రెప్పవాల్చకుండా చూస్తున్న ఆ వ్యక్తుల్ని చూసి భయంతో రెండడుగులు వెనక్కి వేశాడు నానీ.

కానీ ఆలస్యమైంది!

ఇప్పుడు నానీ మెడ చంద్రం చేతిలో చిక్కుకుపోయింది.

“చెప్పు” బలంగా నేలపైకి విసిరేసాడు చంద్రం “ఇన్‌స్పెక్టర్‌కేం చెప్పావు?” ఏడుపు లంకించుకున్న నానీకి ఆక్షణంలో యశస్వి మాటలు గుర్తుకొచ్చాయి. చెప్పకపోతే నాన్న కొడతాడన్న భయం - చెబితే అమ్మకొక్కోపమొస్తుందన్న బాధ....

చివరికి చెప్పకూడదనే నిర్ణయించుకున్నాడు.

చంద్రం ఒళ్ళు మరిచి ఎడా పెడా చెంపలు వాచేట్టు కొడుతున్నా పెదవి విప్పలేదు.

“దొంగనా కొడకా.... మాట్లాడవేంరా” మళ్ళీ గద్దించాడు.

“నన్ను కొట్టకు నాన్నా” ఏడుస్తూ కాళ్లను చుట్టేశాడు.

చంద్రం ఏమనుకున్నాడో నానీని విసురుగా నెట్టి బయటకు నడుస్తుంటే సరళ అడ్డం పడింది“ఇప్పుడేమౌతుందన్నయ్యా?” భయంగా అడిగింది.

“వాడసలు విషయం కక్కితే మనందరికీ ఉరిశిక్ష పడుతుంది” అసహనంగా అని బయటకు వెళ్ళిపోయాడు.

సరళ నిలువునా కంపించిపోయింది.

భర్త పెద్దకర్మకి రావచ్చని నచ్చచెప్పినప్పుడు వెళ్ళిపోయినా బాగుండేది. అనవసరంగా ఉండిపోయింది. ఇప్పుడు కోర్టుల చుట్టూ తిరగాలి.

అసలు రాజారావుతో వుండగా నానీకి పట్టుబడడంతో ఇంత రభసా జరిగిపోయింది.

ఇప్పుడేం చేయాలి?

చాటుమాటుగానయినా రాజారావుతో నూరేళ్లు సుఖంగా బ్రతికేయాలనుకున్న సరళకి ఏం చేయాలో పాలుపోక తల్లిని చుట్టేసి బావురుమంది.

ఒళ్లంతా దెబ్బలతో కమిలిపోయిన నానీ తాతయ్యను చేరుకుని బాధనంతా చెప్పుకుని ఏడ్చేయాలనుకున్నాడు. కాని భయంతో కాళ్ళాడటం లేదు.

అమ్మ గుర్తుకొచ్చింది.

అమ్మంటే అసలు కొట్టనిచ్చేది కాదు.

ఇంక రోజూ కొడతారేమో అన్న భయంతోపాటు భయం వేస్తే అమ్మ పాడుకోమన్న దేవుడి పాట జ్ఞప్తికొచ్చింది.

ఆ గదిలో ఓ మూల ముడుచుకుపోయి ఆ పాటని మనం చేసుకున్నాడు.

"నాకు భయ్యమంటే అస్సలు భయ్యం లేదు.

అమ్మ అస్తమానం నాకు అండగా వుంటుంది కాబట్టి.

ఎవరన్నా కొట్టినా నా కస్సలు కోపం రాదు

కోపం తెచ్చుకుంటే అది పాపం కాబట్టి.

చీకటంటే చంద్రుడు నాకు తోడుంటాడు కాబట్టి.

భూతాలంటే నేనెందుకు భయపడాలి

దేవుడు నాకు దోడుంటాడుగా మరి"

ఒక తారకమంత్రంలా జపించుకునేసరికి ఒంటినొప్పి చాలా వరకు తగ్గిపోయింది. చీకటిపడే దాకా అమ్మ పాటనే గుర్తు చేసుకునేసరికి బోలెడంత ధైర్యం కూడా వచ్చేసింది.

బుజ్జగించడానికి ఎవరన్నా వస్తారేమో అని చూశాడు కాని ఎవరూ పట్టించుకోకపోయేసరికి తనే తాతయ్య దగ్గరికి నడిచాడు.

గదంతా చీకటిగా వుంది "లైటెయ్యనా తాతయ్యా" అన్నాడు నెమ్మదిగా.